# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 161 | విశాఖపట్నం | 13-3-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 161 | VISAKHAPATNAM | 13-3-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## సంపద సృష్టికి అన్ని అవకాశాలను

# ఉపయోగించుకోవాలి

### రెండో రోజూ కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని సక్రమంగా ఉపయోగించుకుంటేనే మంచి ప్రయోజనాలు పొందగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాబోయే తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహజ వనరులను అందించాల్సిన బాధ్యత మనందరిపైనే ఉందని సీఎం పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 2వ రోజు కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్ - సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య-నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. అమరావతిలో క్రియేటివ్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో ఆతిథ్య రంగానికి మంచి అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. దానికోసం 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలన్నారు. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారన్న సీఎం, ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నందున, వాటిని అభివృద్ధి చేసే అంశంపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగంలో పెట్టుబడులపై కీలక సమీక్ష: యుద్ధ ప్రభావాల దృష్ట్యా, విదేశాల కంటే స్థానికంగా ఉండే పర్యాటకానికి పెద్దఎత్తున ఆకర్షణ పెరుగుతుందని సీఎం తెలిపారు. పాపికొండలు, గండికోట, భారత్ గ్రాండ్ కెన్యాన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుందన్నారు. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుందని సూచించారు. కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరని అన్నారు. ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ పెరిగేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని (తరువాయి 2వ పేజీలో)

## క్యాప్ జెమినీ సీఈవోతో మంత్రి లోకేష్ భేటీ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** క్యాప్ జెమిని సీఈవో ఐమాన్ ఇజ్జత్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులపై కీలక చర్చ జరిగింది. విశాఖలో 20వేల ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం గల ఐటీ డెవలప్ సెంటర్, జీసీసీ, క్లౌడ్ సర్వీసెస్, బీపీఎం వర్టికల్స్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీ ల్యాబ్స్ (ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అభివృద్ధి, డిజిటల్ టాలెంట్ పైప్ లైన్) ఏర్పాటు కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి కో డెవలప్‌మెంట్ పార్టనర్‌గా వ్యవహరించాలని అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం వ్యాలీ అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## వైసీపీ అనేది కోట్లాది మంది

# ప్రజల సొత్తు

### వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు మిన్నంటాయి. ఈరోజు జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో పార్టీ అధినేత జగన్ వైసీపీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. పార్టీ భవిష్యత్తుపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే ఈ పార్టీ పుట్టిందని జగన్ గుర్తుచేశారు. తాను ఇచ్చిన ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశను, దిశను మార్చివేసిందని ఆయన అన్నారు. 2011 మార్చి 12న పార్టీ ఆవిర్భవించిందని... వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజల సొత్తు అని, మొదటి నుంచి తాను కేవలం ప్రజలను, దేవుడిని మాత్రమే నమ్ముకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు వైసీపీ ఎప్పుడూ కట్టుబడి (తరువాయి 2వ పేజీలో)




2లో

### తప్పుడు విదేశాంగ విధానం వల్లే ఎల్పీజీ కొరత..

పార్లమెంటు ఆవరణలో రాహుల్ నిరసన

## కళ్లలో తరచూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



6లో



7లో

### గ్యాస్ సరఫరాలో తీవ్ర కొరత?

# సిలిండర్ రూ. 4 వేలు..

### కృత్రిమ కొరతతో ఏజెన్సీల భారీ దోపిడీ!



**హైదరాబాద్, పతాకం న్యూస్:** గ్యాస్ కొరతను సాకుగా చూపి ఏజెన్సీలు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. అధికారికంగా బుక్ చేసుకున్న వారికి 'స్టాక్ లేదు' అని చెబుతూనే, రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ముట్టజెప్పే వారికి గుట్టుచప్పుడు కాకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో, పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి కూడా సిలిండర్లను అక్రమంగా తరలించి మాదాపూర్ వంటి ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య సిలిండర్ల ధరలు ఆకాశాన్ని తాకడంతో చిన్న హోటళ్లు మూతపడుతుండగా, ఐకానిక్ హోటల్స్ కూడా చేతులెత్తేస్తున్నాయి. హైదరాబాద్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన బావర్చి హోటల్ బుధవారం మూతపడటం నగరంలో గ్యాస్ సంక్షోభానికి నిదర్శనంగా నిలిచింది. ఐటీసీ వంటి దిగ్గజ హోటల్ గ్రూపులు సైతం తమ ఆహార సేవలలో అంతరాయం కలగవచ్చని కస్టమర్లకు ముందే సమాచారం ఇస్తున్నాయి. ప్రముఖ దేవాలయాల్లో ప్రసాదాల తయారీ, అన్నదాన కార్యక్రమాలు ప్రశ్నార్థకంగా మారాయి.

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి.



## రంజాన్ తోఫా ఏది?: షర్మిల

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కల్లోలం

పశ్చిమాసియాలో ఇజ్రాయిల్, అమెరికా రేపిన మంటలు సామాన్యుడి జీవితంలో కల్లోలం సృష్టిస్తున్నాయి. మన దేశంలో తగినన్ని చమురు, వంట గ్యాస్ నిల్వలున్నాయని ప్రకటిస్తూనే... ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాలు మోపడం దారుణం. గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య గ్యాస్‌పై రూ.115 పెంచేసింది. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు గ్యాస్ సరఫరా నిలిచిపోగా, గృహ వినియోగదారులు 25 రోజుల తరువాతే బుక్ చేసుకోవాలని ఆంక్షలు పెట్టడం అన్యాయం. మన ప్రధానికి ఆప్త మిత్రులు ట్రంప్, నెతన్యాహు యుద్ధోన్మాదంతో అడ్డూ అదుపూ లేకుండా సాగిస్తున్న నరమేధంతో ప్రపంచ శాంతికి ముప్పుగా మారడంతోపాటు ఇంధన సంక్షోభానికి కారణమయ్యారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు క్షేత్రాలు, రేర్ ఎర్త్ ఉన్న దేశాలనూ కబళించడంలో భాగంగా వెనిజులా అధ్యక్షుడి కిడ్నాప్‌నకు పాల్పడిన అమెరికా... అదే తరహాలో ఇరాన్ నాయకత్వాన్ని మార్చేందుకు ప్రయత్నించింది. సుప్రీం లీడర్ సహా అగ్ర నాయకత్వాన్ని హత్య చేస్తే.. తాము కోరుకున్న తోలుబొమ్మ ప్రభుత్వం కొలువుదీరుతుందనుకున్న యుఎస్, ఇజ్రాయిల్ ఆశలు గత 11 రోజుల ఇరాన్ ప్రతిఘటనతో కల్లలయ్యాయి. ఇరాన్‌లో వందలమంది బాలికలుసహా వెయ్యిమందికిపైగా అమాయకులను పొట్టనపెట్టుకున్న ఇరు దేశాలు... అక్కడి ఆయిల్ డిపోలనూ, చమురు వనరులనూ నాశనం చేస్తున్నాయి. అమెరికా మిలట్రీ బేస్‌లపై ఇరాన్ చేస్తున్న ప్రతి దాడుల్లోనూ ఆయా దేశాల్లోని చమురు వనరులకూ నష్టం వాటిల్లుతోంది. హార్మోజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా 20 శాతం చమురు సరఫరా నిలిచిపోయింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రోజుకు రెండు కోట్ల బారెల్స్ సరఫరా ఆగిపోయింది. 100 డాలర్లకు పైగా చమురు ధరలు ఎగబాకాయి. యుద్ధం కొనసాగితే 200 డాలర్లకు పైగా పెరిగే ప్రమాదముందన్న హెచ్చరికలు ప్రపంచానికి ఆందోళన కలిగించేవే. మనదేశ వంట గ్యాస్ (ఎల్‌పిజి) అవసరాల్లో 85 నుంచి 90 శాతం మధ్య ప్రాచ్యం నుంచి దిగుమతి చేసుకుంటుండగా, అందులో హార్మోజ్ జలసంధి మార్గంలో రావాల్సిన 54 శాతం సరఫరా నిలిచిపోయింది. అమెరికా, ఇజ్రాయిల్ దుందుడుకు చర్యలతో దాదాపు మధ్యప్రాచ్యంలోని దాదాపు 14 దేశాలు యుద్ధ ప్రభావానికి గురయ్యాయి. ఆ మేరకు చమురు, గ్యాస్ ఉత్పత్తి నిలిచిపోయింది. భారత దేశంలో చమురు కొరత లేదని కేంద్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. సరఫరాపై ఆంక్షలు పెడుతోంది. 25 రోజుల తరువాతే గృహ వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని ఆదేశించింది. బ్లాక్‌మార్కెట్‌లో సిలిండర్లు భారీ ధరకు అమ్ముకుంటున్న పరిస్థితీ ఉంది. హోటళ్లు, పారిశ్రామిక అవసరాలకు సరఫరా నిలిచిపోయింది. బెంగళూరు, చెన్నై, ముంబైసహా పలు నగరాల్లో 20 శాతం నుంచి 50 శాతం హోటళ్లు, మెస్‌లు, రెస్టారెంట్లు మూసివేశారు. చాలాచోట్ల టీ, కాఫీలకే పరిమితమయ్యారు. హాస్టళ్లు, మెస్‌లపై ఆధారపడిన విద్యార్థులు, చిరుద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. నిరంతరం ధరల పెరుగుదల, క్షీణిస్తున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్య తరగతి, శ్రామికులకు ఈ పరిణామాలు శరాఘాతం. తన ప్రజా వ్యతిరేక విధానాలను కట్టిపెట్టి పెంచిన ధరలను కేంద్రం తగ్గించాలి. వంట గ్యాస్‌పై పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకోవాలి. ఎల్‌పిజి సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రభుత్వాలు ఇప్పటికే కేంద్రాన్ని కోరాయి. అమెరికా సామ్రాజ్యవాద విధానాల ముందు లొంగిపోయిన మోడీ ప్రభుత్వం... పశ్చిమాసియా వివాదమే గ్యాస్ కొరతకు, ధరల పెంపునకు కారణమమని సమర్థించుకోవడం దాని స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. యుఎస్-ఇజ్రాయిల్ యుద్ధోన్మాద విధానాలను ప్రతిఘటించాలి. పెట్రోలు, వంట గ్యాస్ కొరతను నివారించడంతోపాటు ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఎల్‌పిజి కొరతను సమీక్షించేందుకు కమిటీ వేశామని తాజాగా కేంద్రం ప్రకటించింది. కమిటీలతో కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదే.

## తప్పుడు విదేశాంగ విధానం వల్లే ఎల్పీజీ కొరత..

### పార్లమెంటు ఆవరణలో రాహుల్ నిరసన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇంధన భద్రత విషయంలో కేంద్రం రాజీ పడిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తలెత్తిందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్లమెంటు ఆవరణలో విపక్షాలు గురువారంనాడు నిరసనకు దిగాయి. రాహుల్ గాంధీ ఈ నిరసనలో పాల్గొంటూ... సమస్య సంక్షోభంగా మారకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని అన్నారు. 'విదేశాంగ విధానాన్ని ప్రభుత్వం మార్చుకోవాల్సి అవసరం ఉంది. గ్యాస్, పెట్రోల్ సమస్యగా మారబోతున్నాయి. ఇంధనం సమస్యగా మారనుంది. దీనికంతటికీ ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీపడటమే కారణం. లోపభూయిష్ఠమైన ఇంధన విధానమే సమస్యను తెచ్చిపెట్టింది' అని రాహుల్ గాంధీ విమర్శించారు. సమస్య సత్వర పరిష్కారానికి ప్రధానమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని, తగిన సన్నాహకాలు చేయకుంటే కోట్లాది మంది ప్రజలు ఇక్కట్ల పాలవుతారని అన్నారు. ఈ సందర్భంగా సహచర ఎంపీలతో కలిసి ఛాయ్‌లో బిస్కెట్లు ముంచుకుంటూ రాహుల్ తిన్నారు. గ్యాస్ సంక్షోభం కారణంగా ఛాయ్, బిస్కెట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని నిరసన తెలిపారు. పార్లమెంటు మకర ద్వారం వద్ద విపక్షాలు జరిపిన నిరసనలో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోదీ జీ, ఎల్పీజీ' అంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఇటుకలతో ఏర్పాటు చేసిన వంట పొయ్యిలతో ప్రియాంక గాంధీ తదితర మహిళా ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో తలెత్తిన సంక్షోభం, భారత్‌పై పడుతున్న ప్రభావంపై పూర్తి స్థాయి చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

## 10 మంది తెలంగాణ ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్.. పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

## 350 ఎలక్ట్రిక్ బస్సులకు గ్రీన్‌సిగ్నల్



**తిరుపతి, పతాకం న్యూస్:** కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. మంగళం 1, 2 డిపోలుగా విభజించి 50చొప్పున బస్సుల నిర్వహణ బాధ్యతలను వేర్వేరు ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. తొలివిడతగా నాలుగునెలల్లో 50 ఈకా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. వీటికి పినాకిల్ ఈ-మొబిలిటీ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. తాజాగా మంగళం డిపోకే మరో 50బస్సులు కేటాయించడంతో ఆ డిపో పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌గా మారనుంది. దాంతో బస్సుల కొనుగోలు, మౌలికసదుపాయాల ఏర్పాట్లకు నిధుల కేటాయింపుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరిస్తాయి.

## మహిళా ఎక్సైజ్ సీఐ భర్త ఆత్మహత్య

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లోని నేరెడ్‌మెంట్‌లో మహిళా ఎక్సైజ్ సీఐ భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం రేపింది. భార్య వేధింపులు భరించలేక నగెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి, ఆత్మహత్య చేసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. వివరాల్లోకి వెళితే... మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్ 2012లో సట్లపల్లి జ్యోతిని వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత ఆమె ఉన్నత చదువులకు, ఉద్యోగ ప్రయత్నాలకు శ్రీనివాస్ పూర్తి స్థాయిలో అండగా నిలిచారు. ఆయన ప్రోత్సాహంతోనే జ్యోతి ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా ఎంపికై, ప్రస్తుతం సీఐ స్థాయికి చేరుకున్నారు. అయితే పదవి, హోదా పెరిగిన తర్వాత వారి కాపురంలో కలహాలు మొదలైనట్టు తెలుస్తోంది. సీఐగా ప్రమోషన్ వచ్చిన తర్వాత ఇంటికి రావడం కూడా మానేసిందని సమాచారం. గత నాలుగు నెలలుగా వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. జ్యోతి తన పలుకుబడిని ఉపయోగించి శ్రీనివాస్‌పై తప్పుడు వరకట్న వేధింపుల కేసులు పెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి.

## చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు తాను జరిపిన ముంబై పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించడంపై రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ఆనందం వ్యక్తం చేశారు. సీఎం ప్రశంసలు తనలో మరింత ఉత్సాహాన్ని నింపాయని ఆయన తెలిపారు. ముంబయిలో జరిగిన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో తాను పాల్గొని, రాష్ట్ర పర్యాటక పాలసీ, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించినట్లు మంత్రి తెలిపారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రముఖ సంస్థ 'మోడ్రన్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' విశాఖపట్నంలో రూ.100 కోట్ల పెట్టుబడితో ఒక భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ పర్యటనలోనే ఏఐ ఆధారిత సినిమా, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై యూరోస్ సంస్థ ప్రతినిధులతో ఫలప్రదమైన చర్చలు జరిపినట్లు దుర్గేశ్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో అమరావతిలో 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేసి, రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీకి కొత్త అవకాశాలు సృష్టించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రంజాన్ తోఫా ఏది?: షర్మిల




**అమరావతి, పతాకం న్యూస్:** ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్‌ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఉపయోగించుకోవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.'రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైఎస్సార్సీపీ హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమే.' అని చంద్రబాబు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో జిల్లా కలెక్టర్లు పోటీ పడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో జిల్లాల వారీగా ర్యాంకులిస్తామని తెలిపారు. పెట్టుబడులు రాబట్టడం వాటిని గ్రౌండ్ అయ్యేలా చూడడంలో కలెక్టర్లు ప్రోయాక్టీవ్‌గా ఉండాలన్నారు. పెట్టుబడుల ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ప్రణాళికలు సిద్ధం చెయ్యాలి: జిల్లాల్లో ఉన్న అవకాశాలు అనుకూలతల ఆధారంగా పెట్టుబడులు సహా వివిధ రంగాలను ప్రోత్సహించేలా కలెక్టర్లు ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ రీజియన్‌కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్, తిరుపతి రీజియన్‌కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారని తెలిపారు. అనుమతులు వేగంగా ఇవ్వటంతోపాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారని తెలిపారు. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఓర్వకల్లు పారిశ్రామిక క్లస్టర్‌లా తయారు కావాలని ఆదేశించారు. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసిందని విమర్శించారు.

## ప్రజల సొత్తు

ఉంటుందని చెప్పారు. వైసీపీ అభిమాని కాలర్ ఎగరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందని ఆయన కార్యకర్తల్లో ధైర్యం నింపారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రతి గుండెకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైఎసీపీ శ్రేణులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. 2011లో స్థాపించబడిన ఈ పార్టీ, 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు, ఎక్స్ వేదికగా కూడా ఆయన భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టారు. "నా ధైర్యం మీరే.. నా బలం మీరే. నాన్న గారి ఆశయ సాధన కోసం స్థాపించిన మన పార్టీని, నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు, భుజాలపై మోస్తున్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా పార్టీ కోసం నిలబడుతున్నారు. పార్టీపై నమ్మకం పెట్టుకుని, నాపై నమ్మకం ఉంచి పార్టీ కోసం నిలిచిన మీరే మన పార్టీకి అసలైన బలం.. నా బలం. మన పార్టీ ప్రస్థానం కేవలం ఒక రాజకీయ ప్రయాణం మాత్రమే కాదు. ఒక లక్ష్యంతో లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పేరు పేరునా శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు.

# జోలాపుట్టు జలాశయాన్ని తనిఖీ చేసిన జాతీయ డ్యాం సేఫ్టీ బృందం సభ్యులు



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు ప్రధాన జలాశయాన్ని జాతీయ డ్యాం సేఫ్టీ బృందం సభ్యులు తనిఖీ చేశారు. పురాతన కాలం నాటి ఈ జలాశయ ప్రస్తుత స్థితిగతులను సమీక్షించడానికి ముగ్గురు సభ్యులు గల బృందం రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా కాంపిటెన్సీ డ్యాం సేఫ్టీ ఇవాల్యుయేషన్ చైర్మన్ కమలేష్‌కుమార్ జైన్ మాట్లాడుతూ అత్యంత పురాతన కట్టడాల్లో ఇదొకటి అయినప్పటికీ స్థానిక ఇంజనీర్లు, సిబ్బంది నిర్వహణ బాగానే చేస్తున్నారని కితాబు ఇచ్చారు. అయితే ఇంకాస్త మెరుగులు దిద్దాల్సి ఉందని సూచించారు. జల విద్యుత్ కేంద్రాన్ని హెరిటేజ్ ప్రాజెక్టుగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ బృందం గత రెండు రోజులుగా జోలాపుట్టు ప్రధాన జలాశయం వద్ద ఉన్న గేట్లను, సొరంగ మార్గాన్ని, జలాశయం గోడలను, ఇతర యంత్రాల పరితీరును పరిశీలించింది. అలాగే ప్రతీ ఏడాది జలాశయంలో నీటి నిల్వలు ఏ మేరకు వస్తున్నాయి?, నీటి సరఫరా ఎలా జరుగుతుంది?, సరఫరా చేసే సమయంలో ఇబ్బందులు ఏమైనా తలెత్తుతున్నాయా?, తదితర అంశాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జోలాపుట్టు జలాశయం వద్ద చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆ బృందం ప్రతినిధులు తెలిపారు. వారి వెంట ఏపీ జెన్‌కో విద్యుత్ సౌధ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఈ (సివిల్) షేక్ హుస్సేన్, ఈఈ (సివిల్) కుషప్రధాన్, ఏడీఈ (సివిల్) టి.వెంకటమధు, ఏఈలు ఉన్నారు.

## సరుకు రవాణాలో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భారతీయ రైల్వేలోని వాల్తేరు డివిజన్ సరుకు రవాణాలో అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 24 రోజుల సమయం ఉండగానే, నిర్దేశించుకున్న 78.45 మిలియన్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని అధిగమించింది. మార్చి 7 నాటికి డివిజన్ 78.464 మిలియన్ టన్నుల రవాణాను పూర్తి చేసి రికార్డు నెలకొల్పింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చి 7 నాటికి డివిజన్ 67.254 మిలియన్ టన్నుల లోడింగ్ సాధించగా, ఈసారి ఏకంగా 16.5 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ప్రకృతి వైపరీత్యాలు, భద్రతాపరమైన సవాళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు (డబ్లింగ్, ట్రిపుల్ లైన్ ప్రాజెక్టులు) కొనసాగుతున్నప్పటికీ ఈ అసాధారణ ఫలితాలను సాధించడం గమనార్హం. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఈ సందర్భంగా ఃటీమ్ వాల్తేరుఃను అభినందించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఃమార్చి 7 వాల్తేరు డివిజన్ చరిత్రలో ఒక చిరస్మరణీయమైన రోజు. సిబ్బంది అంకితభావం వల్లే ఈ అద్భుతమైన ఘనత సాధ్యమైందిః అని ఆయన పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ఆర్థిక సంవత్సరాన్ని మరింత మెరుగైన ఫలితాలతో ముగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ‘దీర్ఘాయుష్మాన్’తో ఉచిత బైక్ అంబులెన్స్ సేవలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆరిలోవ హెల్త్‌సిటీలోని మెడ్‌సీ ఆసుపత్రి ఆవరణలో దీర్ఘాయుష్మాన్ యాప్‌ను సినీ నటుడు సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘాయుష్మాన్ యాప్ ద్వారా ఉచితంగా బైక్ అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలకు కొన్ని సమయాల్లో అత్యవసర చికిత్సలు అవసరం ఉంటాయని, ఆ సమయంలో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ ట్రాఫిక్ జామ్, మారుమూల ప్రాంతాలు కావడం వంటి కారణాలతో అనుకున్న సమయానికి చేరుకోక పోవడం, చికిత్స ఆలస్యం కావడం జరుగుతుందన్నారు. ఇటువంటి సమయంలో బైక్ అంబులెన్స్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రమాద ఘటనలు జరిగే సమయంలో తక్షణ చికిత్స అనేది ప్రాణాపాయం నుంచి తప్పిస్తుందన్నారు. దీర్ఘాయుష్మాన్ సంస్థ వ్యవస్థాపకులు మద్దినేని రవిచంద్ర మాట్లాడుతూ, బైక్ అంబులెన్స్ ద్వారా ఒక నర్సుతో పాటు వైద్యుడు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. దీర్ఘాయుష్మాన్ యాప్ లేదా టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించడం ద్వారా బైక్ అంబులెన్స్‌తో అత్యవసర వైద్య సేవలు పొందవచ్చన్నారు. మెడ్‌సీ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ శిరీషా రాణి మాట్లాడుతూ, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో ఆసపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ వజ్ర ప్రహార్’ పేరిట పోలీసుల తనిఖీలు



**నర్సీపట్నం, గొలుగొండ, పతాకం న్యూస్:** గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పోలీసులు తెల్లవారుజామున ‘ఆపరేషన్ వజ్ర ప్రహార్’ పేరుతో నర్సీపట్నం, గొలుగొండ మండలాల సరిహద్దులోని నీలంపేట, అయ్యన్నపాలెం జంక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం పట్టణ, రూరల్, గొలుగొండ స్టేషన్లకు చెందిన పది మంది పోలీసులు అధికారులు, 74 మంది సిబ్బంది కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 200 ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, 250 మందిని విచారించారు. రికార్డులు లేని 35 ద్విచక్ర వాహనాలను, ఒక కారును సీజ్ చేశారు. గంజాయి కేసుల్లో పాత నేరస్థుడు, రౌడీషీటర్ అయిన రుత్తల బోడకొండ అలియాస్ నాని ఇంట్లో పెద్ద కత్తితోపాటు కోడి పందేలకు వినియోగించే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన 370 కిలోల గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న మొదటి నిందితుడు జి.కుమారస్వామిని అయ్యన్న కాలనీలో అరెస్టు చేశారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం జరుగుతుంటే 1972 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు.

## యుద్ధాన్ని ఖండిస్తూ కార్మిక సంఘాల నిరసన




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడుతూ ఆయిల్ మీద పెత్తనం కోసం అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై ఈ యుద్ధం చేస్తున్నాయన్నారు. దీన్ని తక్షణం ఆపాలని, లేనిపక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థ, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. దేశంలో గ్యాస్ కొరత నెలకొందన్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా తగ్గిపోవడం వల్ల హోటళ్లు, గిగ్ వర్కర్లు, తోపుడుబండ్ల కార్మికులు, హాస్టల్స్ ఇలా ప్రతి రంగం అతలాకుతలమవుతున్నాయన్నారు. మన దేశం నుండి ఎగుమతయ్యే రొయ్యలు, గుడ్లు, అరటి పండ్లు, ఉల్లిపాయలు వంటివి ఎగుమతి కాకుండా ఆగిపోయాయన్నారు. దేశ ప్రయోజనాలరీత్యా మోడీ తన విధానాలను మార్చుకొని యుద్ధం ఆపేందుకు కృషి చేయాలన్నారు. యుద్ధం వద్దని ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితిలో యుద్ధం ఆపాలని భారత ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మోడీ కనీసం నోరు విప్పకపోవడం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని తెలియజేశారు. ఇప్పటికే పాకిస్తాన్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.350 దాటిందన్నారు. భారతదేశంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60కు పెంచారని, భవిష్యత్తులో చమురు నిక్షేపాలు నిల్వలు లేవని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. దేశంలో చమురు ధరలు పెరిగితే ప్రజలు వాడే నిత్యావసర ధరలన్నీ పెరుగుతాయన్నారు. తక్షణమే యుద్ధం ఆపి ప్రపంచంలో శాంతి నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.ఎం.కుమార మంగళం, పి.మణి, పి.వెంకటరావు, కె.కుమారి, వై.రాజు, గణేష్, ఎం.సుబ్బారావు, ప్రకాశరావు, ఏఐటియుసి నాయకులు బూసి వెంకటరావు, ఎస్‌కె.రెహమాన్, పదాల రమణ, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లిలో... యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అనకాపల్లి కూరగాయల మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనంలో భాగంగానే ఈ యుద్ధం సాగుతోందన్నారు. ఇరాన్‌పై తక్షణం దాడులను ఆపాలని కోరారు. ఈ యుద్ధంతో ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా భారతదేశంలో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ ధరలను కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిందని, హోటల్స్‌కు గ్యాస్ సరఫరాను కుదించిందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు కారణమైందని తెలిపారు. చమురు నిక్షేపాల కోసం అమెరికా పన్నుతున్న కుట్రలను ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో పసిపిల్లల ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబు, ఎ.రాజు, అప్పారావు, నాయుడు, సురేష్, చలపతి, పాపారావు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ప్రస్తుతం బాలికలుగా వున్న వారికి భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడకుండా వుండేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌పీవీ (గార్డసిల్) టీకా కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాంతీయ ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో ప్రధాని మోదీ ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ వ్యాక్సిన్ ప్రైవేటుగా వేసుకోవాలంటే రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలకు మాత్రమే ఈ టీకా వేయాలని అన్నారు. వ్యాక్సిన్ కోసం బాలికలను ఆస్పత్రులకు రప్పించకుండా ఆయా పాఠశాలల్లోనే శిబిరాలు నిర్వహిస్తే బాగుంటుందని అన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను తాను చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రిలో ఓపీ రిసెప్షన్ నూతన కౌంటర్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, డాక్టర్ సువర్ణ, ఆర్డీవో వీవీరమణ, ప్రాంతీయ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, డీపీఎం డాక్టర్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు




**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాలో వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. దీంతో రానున్న రోజుల్లో నీటికి మరింత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తాయేమోనని జనం ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలనే లక్ష్యంతో మొదలైన జల్ జీవన్ మిషన్ పనులు సుమారుగా ఆరు నెలలుగా నిలిచిపోవడమే ఇందుకు కారణంగా పలువురు చెబుతున్నారు. అయితే ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించకపోతే తాగునీటి సమస్య మరింత జఠిలమవుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాల పరిధిలో 7,185 పనుల ద్వారా 2 లక్షల 64 వేల 766 ఇళ్లకు కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు రూ.626 కోట్లు మంజూరయ్యాయి. ఆయా పనులను గత నాలుగేళ్లుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో చేయిస్తున్నారు. ప్రస్తుతానికి రూ.131 కోట్ల పనులు మాత్రమే జరగ్గా 96 వేల ఇళ్లకు కొళాయిల ద్వారా తాగునీటిని అందించారు. అయితే జిల్లా వ్యాప్తంగా గత ఏడాదిన్నర కాలంలో రూ.26 కోట్ల విలువ చేసే 443 పనులు జరగ్గా, వాటికి సంబంధించి పది నెలలుగా ఎటువంటి బిల్లులు విడుదల కాలేదు. దీంతో ఆయా పనులు వివిధ దశాల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాస్తవానికి విడతలుగా బిల్లులు మంజూరైతే పనులు జోరందుకుంటాయి. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో ఏడాది కాలంగా 443 పనులు అందుబాటులోకి రాని పరిస్థితిలో వేలాది కుటుంబాలకు ఇంటింటా కొళాయి ద్వారా నీళ్లు అందని దుస్థితి కొనసాగుతున్నది. జిల్లాలో వేసవి ప్రారంభంలోనే అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కావడంతో రానున్న రోజుల్లో పరిస్థితులపై జనం ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి జల్ జీవన్ మిషన్‌లో చేపడుతున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేస్తే పనులు జరిగి అనేక గ్రామాలకు తాగునీటి సౌకర్యం కలిగి ఉండేది. కానీ అందుకు భిన్నంగా అరకొరగా జరిగిన పనులకే బిల్లులు విడుదల కాకపోవడంతో గతేడాది మే నాటికి పూర్తికావాల్సిన వందల సంఖ్యలో పనులు నేటికీ జరగలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో గిరిజనులకు తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయి. కాగా ఈ ఏడాది ఎండలు సైతం అధికంగా ఉంటాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు ఎక్కువతాయని స్పష్టమవుతున్నది.

## గ్యాస్ సంక్షోభం.. ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం (ూా+ జతీఱంఱం) ముదురుతోంది. ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్ అవుతున్నాయని ఆయిల్ కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇండేన్ గ్యాస్ ఐవీఆర్‌ఎస్, వాట్సాప్ లు బుకింగ్ పని చేయడం లేదు. అప్పుడప్పుడు భారత్, హెచ్‌పీ గ్యాస్ ఐవీఆర్‌ఎస్, వాట్సాప్ బుకింగ్‌లు పని చేయట్లేదు. దీనితో గ్యాస్ డీలర్ల వద్దకు వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. ఏపీలో కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. బ్యాక్ లాగ్ తగ్గించుకునేందుకు ఆయిల్ కంపెనీలు ఇలా చేస్తున్నాయని వినియోగదారులు తెలిపారు. వినియోగదారుల మొబైల్‌కు ఓటీపీ (ూుూ) వస్తేనే డెలివరీ ఇవ్వాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లపై ఆయా కంపెనీలు ఆంక్షలు విధించాయి. గ్యాస్ దుర్వినియోగం గాకుండా వినియోగదారుల మొబైల్ నుంచి ఓటీపీ (ూుూ) తీసుకుంటున్నామని ఆయిల్ కంపెనీల అధికారులు చెబుతున్నారు. రోజు వారి బుకింగ్‌ల కంటే ఒక్కరోజే మూడు రెట్లు అధికంగా బుకింగ్‌లు జరిగాయని ప్రభుత్వ అధికారులు తెలిపారు. గృహ అవసరాలకు ఎలాంటి గ్యాస్ కొరత లేదని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ప్యానిక్ బుకింగ్‌తోనే ఈ సమస్య వస్తోందని ప్రభుత్వం పేర్కొంది.

## జూకు కొత్త నేస్తాలు రాక



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు మరో ఐదు కొత్త నేస్తాలు వచ్చాయి. భువనేశ్వర్, నందనకాన్ జులాజికల్ పార్క్, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు మధ్య జరిగిన జంతు మార్పిడి ఒప్పందం ప్రకారం ఉదయం ఐదు కొత్త జంతువులు చేరుకున్నాయి. దీనిలో భాగంగా స్వాంప్ డీర్ (నాలుగు కొమ్ముల జింక), ఫోర్ హార్న్ ఆంటిలోప్, అస్సామీస్ మకాక్, మౌస్ డీర్, ఘరియాల్ జంతువులు విశాఖ జూకు చేరుకున్నాయి. వీటికి ప్రతిగా ఇక్కడి నుంచి రింగ్ టైల్డ్ లెమూర్, అడవి కుక్క, సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ, బొనెట్ మాకాక్, నిల్గాయి జంతువులను నందనకాన్ జులాజికల్ పార్కుకు తరలించారు. కొత్తగా వచ్చిన జంతువులను ప్రామాణిక విధాన ప్రకారం క్వారంటైన్‌లో ఉంచామని, క్వారంటైన్ సమయం పూర్తికాగానే సందర్శకుల సందర్శన కోసం ఆయా జంతువుల కోసం నిర్మించిన ఎన్‌క్లోజర్లలో ఉంచనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

## గంజాయితో ముగ్గురి అరెస్టు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పొన్నాడ పంచాయతీ వెంకన్నగారి పేట సమీపంలో గంజా యితో ముగ్గురు యువ కులను అరెస్టు చేయగా, మరో వ్యక్తి పరారైనట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలి పారు. సీఐ తెలిపిన వివ రాల మేరకు.. శ్రీకాకుళం నగరం పాత శ్రీకాకుళాని కి చెందిన గంటల సూర్యతేజ, దమ్మలవీధికి చెందిన కేశవ బాలు, సోపేటి కార్తీక్, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం పిట్టగూడకు చెందిన బురి డి లైకోన్ గంజాయి తాగుతున్నారు. వీరివద్ద గంజాయి ఉందన్న ముందస్తు స మాచారంతో ఎస్ఐ, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి పట్టుకునేందుకు ప్రయత్నించగా.. కార్తీక్ తప్పించుకుని పారిపోగా మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తరచూ ఈ ప్రాంతానికి వచ్చి మద్యం, గంజాయిని తీసు కుంటున్నట్టు విచారణలో తేలింది. వీరి నుంచి ద్విచక్ర వాహనంతోపాటు 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి బురిడి లైకోన్ గంజా యిని తీసుకువచ్చి ఇక్కడ కిలో రూ.3వేలకు విక్రయిస్తున్నట్టు విచారణలో గుర్తిం చారు. గంజాయి సేవించినా, రవాణాకు పాల్పడినా, విక్రయించినా నేరమన్నారు. అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని, చట్టపరంగా రౌడీషీట్లు తెరుస్తా మని హెచ్చరించారు. ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**వజ్రపుకొత్తూరు, పతాకం న్యూస్:** తీర ప్రాంతా లు, పర్యవరణ ప రిరక్షణ అందరి బా ధ్యతని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో భా గంగా శివసాగర్ బీచ్‌లో చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తీరం పరిశుభ్రంగా ఉంచడంలో యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలు పర్యా టకంగా అభివృద్ధి చెందాలంటే చెత్తరహిత ఆరోగ్యకరమైన వాతావరణ కల్పించాలన్నారు. అందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. తీరంలో చెత్తను చెత్త కుండీల్లో వేసేలా తీ రానికి వచ్చే పర్యాటకులను అవగాహన కల్పించి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేయాల న్నారు. కార్యక్రమంలో ఎంపీడీఎవ్ రాష్ట్ర చైర్మన్ వజ్జ బాబూరావు, పలాస- కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, జిల్లా గ్రంథలయ చైర్మన్ విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ అధ్యక్షుడు బుల్లోజు శశిభూషన్, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

## కొత్తగా రూర్బన్ పంచాయతీలు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వాటిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పంచాయతీ అధికారులకు పదోన్నతులు కల్పించారు. అధికంగా నిధులు మంజూరు చేశారు. తాజాగా జనాభా ప్రాతిపదికన పంచాయతీలను విభజించి వాటికి గ్రేడ్లు కేటాయించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. జనాభా, వార్షిక ఆధాయం, భౌగోళిక స్వరూపం ఆధారంగా పంచాయతీలను విభజించి పరిపాలన చేపట్టనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలు ఐదు గ్రేడ్‌లుగా ఉండేవి. వీటిని ఇప్పుడు నాలుగుకు కుదించారు. కొత్తగా రూర్బన్ గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 12 పంచాయతీ లను రూర్బన్‌గా విభజించారు. ఇందులో హిరమండలం, గార, కవిటి, మందస, నరసన్నపేట, పాతపట్నం, పొందూరు, రణస్థలం, సోంపేట, బారువ, టెక్కలి, శ్రీకాకుళం పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో 10 వేలకు పైగా జనాభా, వార్షిక ఆదాయం రూ.కోటి పైగా ఉండడంతో వాటిని రూర్బన్‌లో చేర్చారు. 3వేల నుంచి 10 లోపు జనాభా, వార్షిక ఆదాయం రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు ఉన్న 117 పంచాయతీలను గ్రేడ్-1గా, రెండు వేల నుంచి మూడు వేల జనాభా గల 211 పంచాయతీలను గ్రేడ్-2గా, రెండు వేల కంటే తక్కువగా జనాభా ఉన్న 572 పంచాయతీలను గ్రేడ్ 3 గాను విభజించారు. మైదానం, ఉపప్రణాళికా ప్రాంతం ప్రాతిపదికన వీటిని విభజించారు. రూర్బన్ గ్రామ పంచాయతీల్లో మునిసిపాలిటీ తరహా పాలన సాగ నుంది. వీటిలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్, సాధారణ పాలనా విభాగాలను ఏర్పాటు చేస్తారు. గ్రామ సచివాలయ ఉద్యోగులను ఈ పోస్టుల్లో నియమిస్తారు. ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేస్తారు. తద్వారా పంచాయతీల ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. వీటికి గెజిటెడ్ అధికారిని నియమిస్తారు. ఈ విషయమై మెళియాపుట్టి ఎంపీడీవో ప్రసాద్‌పండా మాట్లాడుతూ 'గ్రేడ్‌ల వారీగా పంచాయతీలను విభజించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. కొత్తగా రూర్బన్ పంచాయతీలు ఏర్పాటయ్యాయి.' అని తెలిపారు.

# పెట్టుబడుల కోసం భూకేటాయింపులు సబబే: ఏపీ హైకోర్టు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానంపై రాష్ట్ర హైకోర్టు సానుకూల ధోరణి వ్యక్తం చేసింది. తక్కువ ధరకు భూములను కేటాయిస్తున్నారంటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలిపోయిందని ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావాలంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. కంపెనీలకు రాయితీలు, భూమి కేటాయింపుల్లో ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పెట్టుబడులు ఎలా వస్తాయని కోర్టు ప్రశ్నించింది. మార్కెట్ ధరకే భూములిస్తే, కంపెనీలు తమకు అనుకూలమైన ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. భూకేటాయింపులను కేవలం ఒక అంశంగా చూడకూడదని, వాటి ద్వారా రానున్న రోజుల్లో వచ్చే ఉపాధి, అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ప్రస్తుత ప్రభుత్వ పాలసీలతో మరో 200 ఏళ్ల పాటు రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ విధానాల వల్ల పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ కంపెనీ కోర్టుకు రాలేదని, కేవలం ఒక రాజకీయ నేత మాత్రమే ఈ విధానాన్ని సవాల్ చేస్తూ కోర్టుకు వచ్చారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వేలం ద్వారా భూములిస్తే ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని కోర్టు అంచనా వేసింది.

హైకోర్టు వ్యాఖ్యలతో పారిశ్రామికవేత్తలకు భూముల కేటాయింపు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు న్యాయపరంగా బలమైన మద్దతు లభించినట్లయింది.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**అనంతగిరి, పతాకం న్యూస్:** విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తినాయక్ హెచ్చరించారు. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ కేంద్రంలో గల పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి, విధులకు హాజరుకాని పారామెడికల్ ఆప్తాల్మిక్, మహిళా హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్‌కు ఒకరోజు జీతం నిలుపుదల చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై స్టాఫ్ నర్సును మందలించారు. పినకోట పీహెచ్‌సీ నుంచి చింతపల్లి పారామెడికల్ ఆప్తాల్మిక్, అలాగే రూడకోట వెళ్లిన స్టాఫ్ నర్స్ డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు. అనంతరం ఆస్పత్రిలో ఏ విధంగా సేవలు అందుతున్నాయని రోగులను ఆయన అడిగితెలుసుకున్నారు. పీహెచ్‌సీని ఆనుకుని ఉన్న ప్రసవ నిరీక్షణ కేంద్రాలను సందర్శించి, గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. కాన్పు తరువాత 48 గంటలపాటు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో తల్లీబిడ్డ ఉండాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించిన తరువాతనే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంతో బాలింతలను తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను ముందస్తుగా సుఖ ప్రసవాల కోసం బర్త్‌వెయిటింగ్ హాల్‌కు తరలించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని, రహదారి లేని గ్రామాల కారణంగా గర్భిణులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పార్టీ కోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పార్టీ ప టిష్ఠత కోసం పనిచేసేవారికి ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో చాకిపల్లి గ్రామానికి చెందిన వంద కుటుంబాలకు పైబడి వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వండాన శేఖర్ ఆధ్వర్యంలో సర్పంచ్ రాంబుక్త రాము, వార్డు మెంబర్లు కాళ్ల అప్పారావు, బోను రామారావు, కనకల సోమేశ్వరరావు, కొత్త షన్ముఖరావు, రశ్న బుయ్య తదితరులు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కుండవా వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాల నలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా ప్రజల కు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతిలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు



**తిరుపతి, పతాకం న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తిరుపతిలోని మారుతినగర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లుగా, అధికారం ఉన్నా లేకున్నా, ప్రజల పక్షంలో పోరాటం కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ప్రత్యర్థులు చెప్పిన అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు. బ్యాంకుల్లో ఒక్క మహిళ కనిపించదు, వ్యాపారస్తులు దుకాణాలు మూసుకుంటున్నారని ఆగ్రహించారు. కేంద్రం ఇచ్చిన అప్పులన్నీ ఏమై పోతున్నాయో తెలియదని, పోలవరం అభివృద్ధి లేదని, రాయలసీమ అభివృద్ధి లేదని పేర్కొన్నారు. పెట్టుబడులు అన్ని అమరావతిలోనే పెట్టబడుతున్నాయన్నారు. 1978 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా ఇంత దారుణమైన ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదన్నారు.

## గిరిజన విద్యార్థులకు కిట్లు పంపిణీ



**మన్యం జిల్లా, పతాకం న్యూస్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న గిరిజన విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పరీక్షా సామగ్రి కిట్లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా యంత్రాంగం, ఐటిడిఏ సంయుక్త ఆధ్వర్యంలో ఐసిఐసిఐ బ్యాంక్ సౌజన్యంతో జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న 1815 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షా కిట్ల పంపిణీ కార్యక్రమం ఆయన ఛాంబరులో జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థికి అవసరమైన రైటింగ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, జ్యామెట్రీ బాక్స్, లాంగ్ స్కేలుతో కూడిన పూర్తిస్థాయి కిట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా కిట్లను అందజేసిన ఐసిఐసిఐ బ్యాంక్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టి, మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిఐసిఐ బ్యాంక్ రీజినల్ హెడ్ సత్యనారాయణ రెడ్డి, ఐటిడిఏ ఎపిఒ పి.మురళీ ధర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, బ్యాంక్ ప్రతినిధులు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.పాలకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శ్రీతేజ చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్టు తరఫున చైర్మన్ మోజోరు తేజోవతి అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఆమె ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పట్టణంలోని బాలిక జెడ్పీ ఉన్నత పాఠశాల, పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలుర హైస్కూల్‌తో పాటు తంపటాపల్లి, ఎం.సింగుపురం తరదితర జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు.

## నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు... గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో నెలకొన్న వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. గ్యాస్ ఉత్పత్తిని పెంచినప్పటికీ, డిమాండ్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగానే ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

## అయోధ్యను తాకిన వంటగ్యాస్ కొరత




**లక్నో:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులతో ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఓవైపు కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో గ్యాస్ కొరత ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రభావం అయోధ్య ఆలయాన్ని తాకింది. ఎల్‌పీజీ సిలిండర్ల కొరత కారణంగా అమావా ఆలయంలోని రామ్ రసోయి (అన్నదాన కేంద్రం)ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు అన్నదాన కేంద్రం వద్ద నోటీసులు అంటించారు. మరోవైపు వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయి, ఢిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఎల్‌పీజీ కొరత వల్ల ఢిల్లీ హైకోర్టులోని క్యాంటీన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం కారణంగా..వంట గ్యాస్ కొరత ఏర్పడుతుండడంతో పలు ప్రాంతాల్లోని తమ హోటళ్లలో రేపటి నుంచి లంచ్, డిన్నర్ అందుబాటులో ఉండదని ప్రముఖ హోటల్ ఐటీసీ వెల్లడించింది. తాత్కాలికంగా ఈ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది.

## వయోపరిమితి జీవోను తక్షణం రద్దు చేయాలి



**ప్రతిపాడు, పతాకం న్యూస్:** సిహెచ్‌సి శానిటేషన్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చిన కార్మికుల 50 ఏళ్ల వయోపరిమితి, చదువు నిబంధన జిఒను రద్దు చేయాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి ముందు కార్మికులు జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన శానిటేషన్, సెక్యూరిటీ వర్కర్స్ అనర్హులని కూటమి ప్రభుత్వ పెద్దలు రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎపిఎంఎస్ఐడిసి) ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 50 ఏళ్లు పైబడిన వారిని తొలగించాలని నిర్ణయం చేశారన్నారు. సిఎం చంద్రబాబు స్నేహితుడినని చెప్పుకునే భాస్కర్ నాయుడు అనే కాంట్రాక్టర్ పద్మావతి హాస్పిటాలిటీ అండ్ ఫెసిలిటీస్ మేనేజ్మెంట్ సర్వీసెస్ తరపున ఈ ఘనకార్యానికి పాల్పడ్డారన్నారు. తిరుపతి, చిత్తూరు, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఈ కాంట్రాక్టు తమకు దక్కిందని ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులుగా కొనసాగాలంటే కనీస విద్యార్హత 8వ తరగతి, 50 ఏళ్ల వయస్సు లోబడి ఉండాలని పైపేర్కొన్న జిల్లాల్లో మూకుమ్మడిగా దశాబ్దాల తరబడి పని చేస్తున్న కార్మికులను ఒక కలం పోటుతో తొలగించారన్నారు. డిగ్రీ లేని సూపర్వైజర్లను తొలగించడం అన్యాయమన్నారు. ఇదే పరిస్థితి అన్ని జిల్లాలలో నెలకొని ఉందని, వందలాది కుటుంబాలను చట్టవ్యతిరేకంగా వీధుల పాలు చేసే హక్కు భాస్కర్ నాయుడికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల అనుసారం కార్మికులకు కనీస వేతనం రూ.26,000లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిహెచ్‌సిలో సెక్యూరిటీ వర్కర్స్‌కు 4 నెలలు జీతాల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి మెడిటేషన్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ గంజి కామేశ్వరరావు, పిట్ట రాజు, వీర్రాజు, ఇ.సత్తిబాబు, కె.నాగేశ్వరరావు, ఎం.సూరిబాబు, సాయి, ఎ.రామలక్ష్మి, సూర్యావతి, వీరలక్ష్మి, బి.గణికమ్మ, కె.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## చిత్తూరులో అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



**చిత్తూరు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముద్దాయిలను చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు రూ.34 లక్షల విలువైన 151 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.6 కిలోల వెండి వస్తువులు మరియు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఫిబ్రవరి 5న దుర్గా నగర్ కాలనీలో నివసించే వరదరాజులు ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లిన సమయంలో నిందితులు లల్లూ ప్రసాద్ (ఎ1), జనార్ధన్ (ఎ2) ఇంటి తలుపు పగలగొట్టి బంగారం, వెండి దొంగిలించారు. బాధితుడు ఫిబ్రవరి 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మార్చి 11న చిత్తూరు--గుడిపాల రహదారిలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో ఎ1 లల్లూ ప్రసాద్‌పై కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 31 కేసులు ఉన్నట్లు తెలిసింది. ఎ2 జనార్ధన్‌పై ద్విచక్ర వాహనాల దొంగతనం మరియు గంజాయి అక్రమ రవాణా సంబంధిత 7 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# ఇరాన్- అమెరికా పరస్పర దాడులతో అగ్నిగుండంలా హర్మూజ్ జలసంధి






**ఇరాన్:** ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతుండడంతో, హర్మూజ్ జలసంధి అగ్నిగుండంలా మారుతోంది. ముడిచమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా వచ్చే చమురు నౌకలపై ఇరాన్ భీకర దాడులకు పాల్పడుతోంది. తాజాగా హర్మూజ్? నుంచి భారత్ వైపు వస్తున్న థాయ్ కార్గో నౌకపై దాడి జరిగింది. దీంతో నౌకలోని ముగ్గురు గల్లంతు అయ్యారని రాయల్ థాయ్ నేవీ ప్రకటించింది. దాదాపు రెండు వారాలుగా పశ్చిమాసియాలో ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికాల మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. దీనితో హర్మూజ్ నుంచి చమురు ట్యాంకర్లు వెళ్లకుండా ఇరాన్ అడ్డుకుంటోంది. అక్కడితో ఆగకుండా ఆ జలసంధి గుండా వెళ్లే నౌకలపై దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఓ కార్గోషిప్‌పై క్షిపణిదాడి జరిగిందని, దీనితో ఆ నౌక పూర్తిగా దగ్ధమైందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. ఒమన్‌కు ఉత్తరాన ఉన్న జలసంధిలో ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది.

అంతకు ముందు యూఏఈ రాస్ అల్-ఖైమా సమీపంలో ఒక నౌకపై డ్రోన్ దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. ఈ డ్రోన్ దాడిలో ఆ కంటైనర్ నౌక ధ్వంసమైనట్లు తెలిపింది. పైగా ఈ జలసంధిలో ఇరాన్ మందుపాతరలు అమరుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

"తాజాగా హర్మూజ్ జలసంధి నుంచి భారత్ దిశగా వస్తున్న థాయిలాండ్‌కు చెందిన 'మయూరీ నారీ' అనే కార్గో నౌకపై దాడి జరిగింది. అది యూఏఈలోని ఖలీఫా పోర్టు నుంచి గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు బయలుదేరింది. హర్మూజ్ మీదుగా వస్తున్న సమయంలో దానిపై దాడి జరిగింది. ఈ దాడికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. ఒమన్ నౌకాదళం ఆ కార్గో షిప్‌లోని 20 మంది నావికులను రక్షించింది. కానీ ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని రాయల్ థాయ్ నేవీ పేర్కొంది. అంతేకాదు ఆ నౌక నుంచి దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను విడుదల చేసింది. కాగా ఈ దాడి చేసినట్లు ఇప్పటి వరకు ఏ గ్రూప్ ప్రకటించలేదు. అయితే ఇది ఇరాన్ చేసిన దాడి అంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

హర్మూజ్ జలసంధిలో మందుపాతరలు అమర్చేందుకు ఇరాన్ పలు నౌకలను ఉపయోగిస్తోంది. అందుకే వాటిని లక్ష్యంగా చేసుకుని అమెరికన్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఇప్పటికే తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన డజనకు పైగా మైన్-లేయింగ్ నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాదు ఈ హర్మూజ్ జలసంధిలో పేలుళ్లు సృష్టించడానికి ఇరాన్ ప్రణాళికలు వేస్తున్నట్లు ఆరోపించింది. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ మైన్స్ అమర్చుతోందన్న వార్తలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఇరాన్ ఎక్కడైనా మైన్స్ అమర్చినట్టైతే, వాటిని తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. లేదంటే మునుపెన్నడూ చూడని స్థాయిలో విధ్వంసం చూస్తారని డెడ్లీ వార్నింగ్ ఇచ్చారు.

"ఇరాన్ స్వయంగా తను అమర్చిన మైన్స్‌ను తీసేస్తే మంచిది. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను, ఇరాన్ మైన్ లేయింగ్ నౌకలపై దాడి చేసేందుకు ఉపయోగిస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. ఇది జరిగిన తర్వాత ఇరాన్?కు చెందిన మందుపాతరలు అమర్చే నౌకలను ధ్వంసం చేసినట్లు యూఎస్? సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అయితే అమెరికా బెదిరింపులకు భయపడేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. అంతేకాదు అమెరికా, ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. దాడులు ఇలానే కొనసాగితే, ఈ ప్రాంతం నుంచి చమురు ఎగుమతులు జరగకుండా పూర్తిగా అడ్డుకుంటామని హెచ్చరించింది. ట్రంప్ కన్నా బలవంతులైన వారు కూడా ఇరాన్‌ను ఏం చేయలేకపోయారని పేర్కొంది. ఇరాన్ భద్రతా మండలి అధికారి అలీ లారిజానీ అయితే, 'తాను అంతం కాకుండా ట్రంప్ జాగ్రత్త పడాలని' ఘాటుగా హెచ్చరించారు.

# కలప వేలంపై కాలయాపన.. రూ.2 కోట్ల విలువైన కలపకు చెదలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అటవీ శాఖ అధికారుల తీరు వల్ల రూ.2 కోట్ల విలువైన మారుజాతి కలపకు చెదలు పడుతోంది. కాకరపాడు కలప డిపోలో నిల్వ ఉన్న కలపకు ఎక్కువ ధర నిర్ణయించి వేలం పాటలు నిర్వహించడం, వ్యాపారులు ముందుకు రాకపోవడంతో మూడేళ్లుగా ఎండకు ఎండి, వానకు తడిసి కలపకు చెదలు పడుతోంది. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో చింతాలమ్మ ఘాట్, రొంపుల ఘాట్‌లో గుంపెన, తంగేడు, పచారీ, బెన్నంగి, సిరిమాను(తెల్లకర్ర), గన్నర, బండారు వంటి మారుజాతి కలప చెట్లను తొలగించారు. సుమారు 1500 క్యూబిక్ మీటర్ల కలపను 2023 జూన్ నుంచి నవంబరు వరకు కాకరపాడు(చీడిపాలెం కూడలి దరి ఐటీడీఏ కాలనీ ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన) వెదురునగరం అటవీ కలప డిపోనకు తరలించి జాతుల వారీగా నిల్వ చేశారు. ఈ కలప సుమారు రూ.2 కోట్ల విలువ ఉంటుంది. అటవీ అధికారులు ఈ కలప అడుగు రూ.500 నుంచి రూ.550 మధ్యలో ధర నిర్ణయించి ఇప్పటి వరకు సుమారుగా 50 వేలం పాటలు నిర్వహించారు. అయితే ఈ ధర ఎక్కువగా ఉండడంతో ప్రైవేటు కలప డిపోల యజమానులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. అటవీ అధికారులు నిర్ణయించిన ధరకు, డిపోల యజమానులు కోరుతున్న ధరకు అడుగుకు రూ.250లు తేడా ఉండడమే కారణం. మూడేళ్లుగా డిపోలో నిల్వ ఉండిపోవడంతో వర్షాలకు తడిసి, ఎండలకు ఎండి కలపకు చెదలు పట్టి పాడై మట్టిలో కలిసిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో వ్యాపారులు కూడా కాస్త ముందుకు వచ్చి అడుగు రూ.300 నుంచి రూ.400కు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కానీ చింతపల్లి డీఎఫ్‌వోకు పది శాతం వరకు ధర తగ్గించే అధికారం ఉంది. అంతకన్నా ఎక్కువ తగ్గించాలంటే అటవీశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి లేఖల ద్వారా తెలియజేసి అనుమతి పొందాలి. ఈ విషయమై డీఎఫ్‌వో సంవత్సరం క్రితమే అటవీశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి లేఖలు రాశారు. అయితే ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. దీంతో రూ.2 కోట్ల విలువైన కలప మట్టి పాలవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ కలప అమ్మకాలకు నిర్దేశించిన ధర విషయమై పునరాలోచన చేసి వేలం పాటలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మాన్సాస్ భూదోపిడీ ఆపాలి

**విజయనగరం, పతాకం న్యూస్:** టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక విజయనగరంలో మాన్సాస్ భూదోపిడీ అధికమైందని, వెంటనే దీన్ని ఆపాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పాత మహారాజా ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారు స్థలాన్ని 22ఎ నుంచి తొలగించి రాజుల కుటుంబానికి అప్పగించారని తెలిపారు. పూల్‌బాగ్‌లో డఫ్ అండ్ డమ్ స్కూల్ ఎదురుగా ఉన్న స్థలం ప్రభుత్వభూమి అంటూ మున్సిపల్ అధికారులు అక్కడ ఉన్న నిర్మాణాలు తొలగించారన్నారు. ఇప్పుడు మాన్సాస్ బోర్డు పాతేశారని, దానిపై సర్వే నెంబర్ కానీ, విస్తీర్ణం కానీ రాయలేదని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని స్పష్టమైందని, దాన్ని తక్షణమే పేదలకు, పేద జర్నలిస్టులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూల్‌బాగ్‌లో పీజీ కాలేజీ ఎదురుగా ఉన్న వారికి, రామకృష్ణనగర్, ఎల్‌బిజి నగర్, గురజాడ నగర్, గంజిపేట, బుంగవీధి, జొన్నగుడ్డి.. ఇలా అనేక చోట్ల పేదలు ఇళ్లు కట్టుకుని 20 నుంచి 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, వీరికి నివాసం ఉన్న చోటే పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్‌చేశారు. గుంకలాం జగనన్న కాలనీ, హుదూద్, టిడ్కో కాలనీల్లో



కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 13న కార్పొరేషన్ కమిషనర్‌కి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. 14న పూల్‌బాగ్ భూమి పరిశీలనకు వెళ్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సిపిఎం నగర నాయకులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లకు పదో తరగతి ప్రశ్నపత్రాలు



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** కె.గంగవరం మండలానికి సంబంధించిన పదో తరగతి ప్రశ్నాపత్రాలను ఎంఇఒ ఆంజ నేయులు, చీఫ్ సూపరింటెం డెంట్ ఖాజా మొహిద్దీన్, కస్టోడియన్లు సుబ్రహ్మణ్యం, అరుగుల శ్రీనివాసరావు సమక్షంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సోమేంద్ర ప్రశ్నాపత్రాలను స్టేషన్‌లో భద్ర పర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతి లేని వ్యక్తులు చేరకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని అన్నారు.

## భారత్‌లో చమురు సంక్షోభం ఉందా?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా, భారత్‌లో ఎలాంటి చమురు సంక్షోభం లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. దేశంలో భారీ స్థాయిలో వ్యూహాత్మక చమురు నిల్వలు ఉండటం, 40కి పైగా దేశాల నుంచి దిగుమతులు చేసుకోవడం వంటి కారణాలతో భారత్ పటిష్ఠ స్థితిలో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం సరఫరా ఆధారిత నిర్వహణతో (సప్లై-సైడ్ మేనేజ్‌మెంట్) పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటోందని అన్నారు. దేశంలో 74 రోజులకు పైగా డిమాండ్‌ను తట్టుకునేంత వ్యూహాత్మక చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని అధికారి వివరించారు. విదేశీ మారక నిల్వలు కూడా బలంగా ఉన్నాయని, ఇవి 11-12 నెలల దిగుమతులకు లేదా 5 ఏళ్ల చమురు బిల్లులను చెల్లించడానికి సరిపోతాయని చెప్పారు. పశ్చిమ దేశాల ఒత్తిడి ఉన్నప్పటికీ, రాయితీపై లభిస్తున్న రష్యా ముడి చమురును భారత్ కొనసాగిస్తోందని, మొత్తం దిగుమతుల్లో ఇది మూడో వంతు ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే చమురుపై 50 శాతం ఆధారపడగా, ఇప్పుడు దానిని 20 శాతానికి తగ్గించుకున్నామని తెలిపారు. భారత్‌లో ద్రవ్యోల్బణం 2.75 శాతం వద్ద అదుపులో ఉండగా, జపాన్‌లో ఇది 5 శాతంగా ఉందని అధికారి గుర్తు చేశారు. మరోవైపు, పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కేవలం 30 రోజుల నిల్వలతో ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. పాకిస్థాన్‌లో లీటర్ పెట్రోల్‌పై ఏకంగా రూ. 55 పెరగ్గా, శ్రీలంకలోనూ ధరలు పెరిగాయి. బంగ్లాదేశ్‌లో ఇంధన రేషనింగ్ విధించారని పోల్చి చెప్పారు. ఇంధన పన్నుల సర్దుబాటు, నియంత్రిత ఎల్పీజీ ధరల వల్లే భారత్‌లో వినియోగదారులపై భారం పడలేదని వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలెప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



**వినుకొండ, పతాకం న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎమ్మెల్యేలు పనితీరును మరింత మెరుగుపరుచుకుని ప్రజల మన్ననలు పొందాలని పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీకి సిఎం చంద్రబాబు సూచించారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ కృతికా శుక్ల, ఎస్పీ బి.కృష్ణారావుతో సీఎం సమీక్షించారు. శాంతిభద్రతలు పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం సమీక్షించారు. జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు.

## హౌసింగ్ ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో 500 చదరపు మీటర్లు లేదా 8 అపార్ట్మెంట్ల కంటే ఎక్కువగా కలిగిన ప్రతి హౌసింగ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎపి రెరా చైర్మన్ ఆర్.ఎస్.శివారెడ్డి తెలిపారు. రెరా ఆధ్వర్యంలో రెరా చట్టం, 2016 నిబంధనలు, వాటి అమలు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ప్రయివేటు హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రెరా వద్ద రిజిస్ట్రేషన్ పొందని ప్రాజెక్టులపై ప్రాజెక్టు వ్యయంలో పది శాతం అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని ప్రాజెక్టులకు మార్చి 31 వరకు 50 శాతం అపరాధ రుసుం సబ్సిడీతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు చెప్పారు. నిర్మాణ రంగంలో వచ్చే సమస్యలు, ఫిర్యాదులను రెరా ద్వారా మాత్రమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో వాస్తవంగా కల్పిస్తున్న సౌకర్యాలను మాత్రమే వినియోగదారులకు తెలియజేయాలని, అగ్రిమెంట్లో పొందుపరచుకోవాలని తెలిపారు. అగ్రిమెంట్లో పొందుపరిచిన విధంగా ప్రాజెక్టు పూర్తి చేయకున్నా, వసతులు కల్పించ కున్నా ఫిర్యాదుల మేరకు రెరా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి

**సామర్లకోట, పతాకం న్యూస్:** వేసవి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున చలివేంద్రాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. సామర్లకోట మఠం సెంటర్ రామాలయం వద్ద రైతులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ.. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చల్లటి త్రాగునీరు, మజ్జిగను అందించడం హర్షనీయం అన్నారు. అంతకు ముందు సామర్లకోట చేరుకున్న ఎమ్మెల్యే చినరాజప్ప మఠం సెంటర్ లో గల రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి




**మొగల్తూరు, పతాకం న్యూస్:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి పునాది అని వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యు.గీతా రాంబాబు అన్నారు. మొగల్తూరులోని అగ్రహారంలో ఉన్న వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, 9వ తరగతి విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు వారి అభిప్రాయాలను సహచరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గీత రాంబాబు మాట్లాడారు. విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు, గ్రామానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. అనంతరం పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అణువుగా ప్యాడ్లు, పెన్నులను అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెళ్లి బృందం వాహనం బోల్తాపడి ఇద్దరు మృతి.. 15 మందికి తీవ్ర గాయాలు





**నిర్మల్, పతాకం న్యూస్:** నిర్మల్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జిల్లాలోని రూరల్ మండలం కొండాపూర్ బైపాస్ వద్ద పెళ్లి బృందంతో వెళుతున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 17 మంది ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా ఇచ్చోడ మండలం సోన్‌పల్లి గ్రామానికి చెందిన ఒక కుటుంబం బంధువులతో కలిసి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరగనున్న వివాహ వేడుకకు హాజరయ్యేందుకు డీసీఎంలో బయలుదేరారు. వాహనం కొండాపూర్ బైపాస్ సమీపానికి చేరుకోగానే టైరు పేలిపోవడంతో స్టీరింగ్ పై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీనితో వాహనం రోడ్డుపై పల్టీలు కొట్టి పక్కకు పడిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# కళ్లలో తరచూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



కళ్లలో తరచూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. అయితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకండి.. కంటిలోని తెల్లని భాగంలో ఒక్కోసారి అకస్మాత్తుగా ఎర్రనిమచ్చ కనిపిస్తుంది. దీనిని చూడగానే చాలా మంది భయపడతారు. ఇది పెద్ద కంటి సమస్యలాగా కనిపిస్తుంది కానీ అన్ని సందర్భాల్లో ఇది ప్రమాదం కాదు. ఈ పరిస్థితిని సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ అని అంటారు. కంటిలోని తెల్లని భాగంలో ఒక్కోసారి అకస్మాత్తుగా ఎర్రనిమచ్చ కనిపిస్తుంది. దీనిని చూడగానే చాలా మంది భయపడతారు. ఇది పెద్ద కంటి సమస్యలాగా కనిపిస్తుంది కానీ అన్ని సందర్భాల్లో ఇది ప్రమాదం కాదు. ఈ పరిస్థితిని సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ అని అంటారు. ఇందులో ట్రామాటిక్, స్పాంటేనియస్ లేదా నాన్ ట్రామాటిక్ సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ అని రెండు రకాలుగా ప్రధానంగా ఉంటాయి. కంటికి గాయం కావడం వల్ల, కళ్లను బలంగా రుద్దడం వల్ల, కంటి శస్త్ర చికిత్స, కాంటాక్ట్ లెన్స్ వాడకం వల్ల ట్రామాటిక్ సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ వస్తుంది. ఇక స్పాంటేనియస్ సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ మాత్రం ఎలాంటి గాయం లేకుండానే వస్తుంది. బలంగా దగ్గడం, తుమ్మడం, వాంతులు వంటి వాటితో పాటు హైబీపీ, డయాబెటిస్ లేదా రక్త సంబంధిత సమస్యలు ఉన్న వారిలో ఎక్కువగా వస్తుంది.

బయటకు కనిపించే కంటి తెల్లభాగాన్ని స్కెర్లా అంటారు. దీనిపై కంజంక్టైవా అనే పలుచని పొర ఉంటుంది. ఈ పొరలో చాలా చిన్న రక్తనాళాలు ఉంటాయి. ఈ రక్తనాళాల్లో ఒకటి పగిలితే రక్తం కంజంక్టైవా కింద చేరి ఉంటుంది. రక్తం అక్కడే నిలిచి పోవడం వల్ల కంటిలో ఎర్రటి మచ్చలా కనిపిస్తుంది. ఇది చూపును ప్రభావితం చేయదు. ఇన్ఫెక్షన్ లేదా వాపు వంటి సమస్యలు కూడా రావు. బలంగా దగ్గడం, తుమ్మడం, వంగి పని చేయడం, తలకిందులుగా నిలబడడం వంటి వాటితో పాటు అస్పిరిన్, వార్ఫరిన్, హెపారిన్ వంటి మందులు కూడా దీనికి కారణం అవుతాయి. కొన్ని సార్లు ఎటువంటి కారణం లేకుండా కూడా ఈ సమస్య తలెత్తుతుంది. అలాగే ఈ సమస్య 1 నుండి 2 వారాల్లో దానంతట అదే స్వయంగా తగ్గుతుంది. రక్తం కరిగి తిరిగి శరీరం గ్రహించేటప్పుడు ఎర్రటి రంగు, పసుపు లేదా గోధుమ రంగులోకి మారి పూర్తిగా నయం అవుతుంది. ఈ సమస్య ఎటువంటి లక్షణాలను చూపించదు, కొంచెం ఇబ్బందిగా ఉంటే ఆర్టిఫిషియల్ టియర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. సాధారణంగా ప్రత్యేక చికిత్స అంటూ అవసరం ఉండదని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ప్రమాదకరం కానప్పటికీ కొన్ని పరిస్థితుల్లో మాత్రం వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది.

ఎర్రటి మచ్చ పదే పదే రావడం, కంటిలో నొప్పి, చూపు మసకబారడం, కంటిచుట్టూ వాపు, కంటి గాయం అయిన తరువాత ఎర్రటి మచ్చ కనిపించడం వంటి పరిస్థితుల్లో మాత్రం తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి. అలాగే ఈ సమస్యను పూర్తిగా నివారించలేరు. కానీ కొన్ని అలవాట్లు ప్రమాదాన్ని తగ్గిస్తాయని చెప్పవచ్చు. కళ్లను బలంగా రుద్దడం వంటివి చేయకూడదు. అలర్జీలను నియంత్రించాలి. దీని వల్ల గట్టిగా తుమ్మడాన్ని తగ్గించవచ్చు. బీపీ నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి. ఆటలు ఆడే సమయంలో కళ్లకు రక్షణగా కళ్లజోడును ధరించాలి. రక్తాన్ని పలుచగా చేసే మందులు వాడే వారు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. కంటిలో అకస్మాత్తుగా కనిపించే ఈ ఎర్రటి మచ్చ చాలా సందర్భాల్లో ప్రమాదం కాదు. ఇది చిన్న రక్తనాళం పగిలి ఏర్పడే సబ్ కంజంక్టైవల్ హేమరేజ్ మాత్రమే అని సాధారణంగా దానంతట అదే తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే ఈ సమస్య పదే పదే రావడంతో పాటు నొప్పి, చూపులో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# గ్యాస్ సరఫరాలో తీవ్ర కొరత?

## గ్యాస్ సరఫరాపై ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఎఫెక్ట్



అమరావతి, **పతాకం న్యూస్:** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొన సాగుతున్న యుద్ధం ఎఫెక్ట్ గ్యాస్ సరఫరాపై పడింది. అటు దేశంలో, ఇటు రాష్ట్రంలోనే గ్యాస్ కొరత లేదని ప్రభు త్వాలు ప్రకటిస్తున్నా సామాన్య, మధ్య తర గతి కుటుంబాల్లో గ్యాస్ కొరత ఉందనే ఆందోళన కలుగు తోంది. దీనికి తగ్గట్టు గానే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవడానికి సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య గడువును 25 రోజులకు పెంచారు. అమెరికా– ఇరాన్ యుద్ధ ప్రభావం తక్షణమే గ్యాస్ సరఫరాపై పడింది. దానికి నిదర్శనమే వాణిజ్య గ్యాస్ సిలిండర్ లలో కోత. గృహ వినియోగ గ్యాస్ విషయం లోనూ ఇప్పుడిప్పుడే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బుక్ చేసుకున్న మరుసటిరోజే గ్యాస్ ఇంటికి వచ్చేసేది. ప్రస్తుతం మూడు రోజులైనా సరఫరా కావడం లేదు. యుద్ధ ప్రభావం వల్ల సరఫరాలో కోత విధిస్తున్నారు. ఇప్పటికే 25 రోజులకు ఒకసారి గృహ వినియోగ గ్యాస్ బుకింగ్ చేయాలంటూ ఏజన్సీలకు ఆదేశాలు జారీ చేశారు. వాణిజ్య సిలిండర్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. కృత్రిమ కొరత లేకుండా ఆదేశాలు జారీచేసింది.

ఇప్పటి వరకు గ్యాస్ బుక్ చేసినా, చేయక పోయినా గ్యాస్ ఆపరేటర్లు గ్యాస్ సిలిండర్లను అడి గిన వెంటనే అందించేవారు. అయితే యుద్ధం తర్వాత గ్యాస్ సరఫరాలో నిబంధనలను కఠినతరం చేశారు. సాధారణంగా గ్యాస్ సరఫరాలో ఆపరేటర్ యాప్‌లో బుక్ చేస్తే గ్యాస్ డెలివరీ చేసేవారు. ఇప్పుడు ఆ విధంగానే చేస్తున్నా ఎవరికి సంబంధించి వారికి గ్యాస్ సరఫరా చేయడానికి వారి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్ అందిస్తు న్నారు. ఒకసారి గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత మరో సిలిండర్ తీసు కోవాలంటే 25 రోజులు దాటితేనే గ్యాస్ బుక్ అవుతోంది. ఇప్పుడు డొమెస్టిక్ సిలిండర్ (వంటగ్యాస్) ధర పెంచడంతో ఏలూరు జిల్లాలో గ్యాస్ సిలిండర్ ధర రూ.946లకు చేరింది. నిబంధనలు తప్పని సరిగా పాటిస్తుండటంతో ఎప్పటికప్పుడు గ్యాస్ సిలిండర్ లభించని పరిస్థితి కనిపిస్తోంది. తప్పనిసరిగా గ్యాస్ బుకింగ్ చేసుకుంటేనే గ్యాస్ సరఫరా చేయడం జరుగుతుంది. యుద్ధం కారణంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.114 పెంచినా సరఫరాను నిలిపివేయడంతో హోటళ్లు, ఇతర వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. హాస్పటళ్లు ఇతరత్రా ప్రభుత్వ అవసరా లకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను కొనసాగిస్తు న్నారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల వాడకం జిల్లాలో రోజువారీ 400 వరకు ఉంటుంది. వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో హోటళ్లు, స్వీట్ దుకా ణాల్లో తినుబండారాలు, స్వీట్స్ ధరలు పెరిగే అవకాశాలున్నాయి.

## స్పీకర్‌పై అవిశ్వాసం తిరస్కరణ



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ మూజువాణి ఓటుతో తిరస్కరించింది. అవిశ్వాస తీర్మానంపై 10 గంటలకు పైగా చర్చ కొనసాగింది. పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య పలుమార్లు వాడివేడి వాదనలు కొనసాగాయి. చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షం, ప్రతిపక్ష నాయకుడిపై అనవసర వ్యాఖ్యలు చేశారని నినాదాలు చేస్తూ... సభ్యులు బుధవారం వెల్‌లోకి దూసుకొచ్చారు.సభను నిర్వహించిన జగదాంబికా పాల్, మూజువాణి ఓటుతో అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించినట్లు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం తిరస్కరణకు గురవుతుందని తెలిసినప్పటికీ, స్పీకర్ ఓం బిర్లా నిష్పాక్షికత, విశ్వసనీయత గురించి ప్రతిపక్షం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తగలిగింది. చర్చలో పాల్గొన్న సభ్యులందరూ ఓం బిర్లా జోక్యాలను, ఆయన అధికార పక్షానికి మద్దతు పలికే వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఇవి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చిక్కుల్లో పడే కీలకమైన అంశాలపై చర్చలను అనుమతించకపోవడం, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడటానికి తగినంత సమయం ఇవ్వకపోవడం, వారి మైక్రోఫోన్‌లను ఆపివేయడం, నిరసన తెలుపుతున్న సభ్యులను సామూహికంగా సస్పెండ్ చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. 12 సంవత్సరాలకు పైగా డిప్యూటీ స్పీకర్‌ను నియమించకపోవడంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించింది. డిప్యూటీ స్పీకర్ లేనందున, ఓం బిర్లా స్వయంగా ఏర్పాటు చేసిన ప్యానెల్ సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా తీర్మానానికి సంబంధించిన చర్చలను నిర్వహించారు. ఇది సరైన చర్చ కాదని ప్రతిపక్షం ఎత్తి చూపినప్పటికీ, పాలక పక్షం దానిని సరిదిద్దడానికి ప్రయత్నించలేదు. స్పీకర్‌పై వచ్చిన తీవ్రమైన ఆరోపణలకు ప్రతిస్పందించడానికి బదులుగా, పాలక పక్షం చర్చలో సింహభాగాన్ని ప్రతిపక్షం, ప్రతిపక్ష నాయకుడిపై దాడి చేయడానికి ఉపయోగించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, బిజెపి ఎంపి నిషికాంత్ దూబే ప్రతిపక్షం లక్ష్యంగా విమర్శలు చేశారు. ప్రతిపక్ష నాయకుడి ప్రధానిని కౌగిలించుకోవడం, ఎగిరే ముద్దులు ఇవ్వడం అని అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించాయి. అమిత్ షా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. పార్లమెంటరీ మర్యాదలను ఉల్లంఘించిన అమిత్‌షా ప్రతిస్పందిస్తూ.. తన వ్యాఖ్యలలో దేనినైనా తొలగించవచ్చని అన్నారు.




## కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవడమంటే ఇష్టం: బుమ్రా




టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన శైలిలో బౌలింగ్ చేస్తూ.. ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తాడు. యార్కర్ బంతులను సంధిస్తూ బ్యాటర్లను వణికిస్తుంటాడు. ఓటమి ఖాయమనుకునే మ్యాచుల్లో సైతం తనదైన బౌలింగ్‌తో విజయాలను అందించాడు. సెమీ ఫైనల్లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ అందుకు నిదర్శనం. ఈ మ్యాచ్‌లో బుమ్రా బౌలింగ్ భారత్‌కు విజయాన్ని అందించిందని అనడంలో అతిశయోక్తి లేదు. ఇది ఇలా ఉంటే తాజాగా టీ20 ప్రపంచ కప్ విజయం గురించి బుమ్రా మాట్లాడాడు. ఆ వీడియోను భారత క్రికెట్ నియంత్రణ మండలి షేర్ చేసింది. ఆ వీడియోలో... 'నాకు కఠిన సవాళ్లు, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవడం అంటే ఇష్టం. అలాంటి సందర్భాల్లో మంచి ప్రదర్శన చేసి, సత్తా చాటినప్పుడు.. అది నాకు చాలా సంతోషాన్ని ఇస్తుంది. దానిలో వచ్చే ఆనందం మరెక్కడ దొరకదు. నేను గుజరాత్‌లోనే క్రికెట్ ఆడటం ప్రారంభించా. ఇప్పుడు ప్రపంచ కప్‌ను కూడా ఇక్కడే సాధించాం. ఫైనల్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలిచింది కూడా ఇక్కడే. ఇవ్వన్ని నాకు చాలా సంతోషాన్ని ఇస్తున్నాయి' అని బుమ్రా అన్నాడు. అహ్మదాబాద్ మైదానంలోనే వన్డే వరల్డ్ కప్ 2023లో భారత్ తృటిలో టైటిల్‌ను కైవసం చేసుకునే అవకాశాన్ని కోల్పోయింది. ఆ విషయాన్ని బుమ్రా గుర్తు చేసుకున్నాడు. 'గతంలో మేం తృటిలో ఓడిపోయాం. కానీ ఈ సారి విజయం సాధించాం. చాలా సంతోషంగా ఉంది. వరుసగా రెండు సార్లు టీ20 ప్రపంచకప్ గెలవడం అంటే మామూలు విషయం కాదు. దేవుడికి ధన్యవాదాలు' అని జస్ప్రీత్ బుమ్రా అన్నాడు. ఇక చరిత్రాత్మక టీ20 ప్రపంచ కప్ తర్వాత, జస్ప్రీత్ బుమ్రా ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున తిరిగి ఆడనున్నాడు.

## దేశవాలీ క్రికెట్ పండుగ

# ఐపీఎల్ షెడ్యూల్ తేదీలు




దేశవాళీ క్రికెట్ పండుగ ఐపీఎల్ షెడ్యూల్ వచ్చేసింది. పలు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తొలి అంచెలో ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 10 వేదికల్లో జరిగే 20 మ్యాచ్‌ల తేదీలను మాత్రమే బీసీసీఐ బుధవారం ప్రకటించింది. చిన్నస్వామి స్టేడియంలో జరిగే లీగ్ ఆరంభ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో డిఫెండింగ్ చాంప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. కాగా, ఈ నెల 29న వాంఖడేలో మాజీ చాంపియన్లు ముంబై–కోల్‌కతా.. ఆ తర్వాతి రోజు గువాహటిలో రాజస్థాన్‌తో చెన్నై ఆడనున్నాయి. ఏప్రిల్ 4,5; 11,12 తేదీల్లో డబుల్ హెడర్‌లను షెడ్యూల్ చేశారు. తొలి అంచెలో పది జట్లు.. నాలుగేసి మ్యాచ్‌లు ఆడనున్నాయి. రాజస్థాన్ తమ తొలి మూడు మ్యాచ్‌లను అసోంలో ఆడిన తర్వాత నాలుగో మ్యాచ్ కోసం జైపూర్‌కు రానుంది. ఈ సీజన్‌లో రెండు జట్లు రెండు హోంగ్రౌండ్‌లను ఎంపిక చేసుకొన్నాయి. బెంగళూరు రెండు మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లో, పంజాబ్ కింగ్స్ మూడు మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడనున్నాయి.

కాగా, పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆడే ప్లేయర్లు ఎలా వస్తారనేది అగమ్య గోచరంగా మారింది. టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొన్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు విమాన సౌకర్యాలు లేకపోవడంతో స్వదేశం వెళ్లడం చాలా ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో వారి మళ్లీ లీగ్‌కు రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విమాన చార్జీలు కూడా ఆకాశాన్నంటడం ఖాయమని చెబుతున్నారు. దీంతోపాటు వంట గ్యాస్ కొరత కారణంగా హోటళ్లను మూసేయాల్సిన పరిస్థితి లీగ్ నిర్వాహకులను కలవరపెడుతోంది. అయితే, తమ జట్టు ఆటగాళ్లు అకిల్ హొస్సేన్ (వెస్టిండీస్), డెవాల్డ్ బ్రేవిస్ (సౌతాఫ్రికా)లు లీగ్ ఆరంభానికి ముందే జట్టులో చేరతారని సీఎ?సకే సీఈవో కాశీ విశ్వనాథ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.




# శరవేగంగా నాగార్జున 100వ చిత్రం షూటింగ్




టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ సినిమాను సైలెంట్‌గా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా, నాగార్జున స్వయంగా నిర్మిస్తున్నారు. తాజాగా దర్శకుడు కార్తీక్ ఓ ఇంటర్వ్యూలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. నాగార్జునను ఆయన అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో సరిగ్గా అలాగే ఈ సినిమాలో చూపించబోతున్నట్లు కార్తీక్ తెలిపారు. గతంలో నాగార్జున కెరీర్‌లో కల్ట్ క్లాసిక్స్‌గా నిలిచిన శివ, రక్షకుడు వంటి చిత్రాల్లో కనిపించిన పవర్‌ఫుల్, స్టైలిష్ అవతారంలో ఆయన మరోసారి దర్శనమివ్వనున్నారని స్పష్టం చేశారు. అలాగే కథానుసారం ఈ సినిమాలో నాగార్జున ఏకంగా మూడు విభిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తారని చెప్పడం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ సినిమా కోసం నాగార్జున ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని, ఆయన లుక్ అభిమానులకు పండగలా ఉంటుందని దర్శకుడు హామీ ఇచ్చారు.

అయితే, ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన 100వ సినిమాకు ఓ స్టార్ డైరెక్టర్‌ను కాకుండా, అనుభవం తక్కువ ఉన్న తమిళ దర్శకుడిని ఎంచుకోవడంపై చాలామంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తాను కూడా నాగార్జునను అడిగానని కార్తీక్ వెల్లడించారు. "నాగార్జున గారితో సినిమా చేయడానికి చాలా మంది దర్శకులు ఎదురుచూస్తుంటారు. మంచి కథలతో వస్తుంటారు. అలాంటిది ఈ అవకాశం నాకు ఎలా ఇచ్చారని అడిగాను. దానికి ఆయన 'కథ నచ్చితే చాలు.. నేను గత 40 ఏళు ్లగా కొత్త దర్శకులతో పనిచేస్తున్నాను' అని సింపుల్‌గా సమాధానమిచ్చారు" అని కార్తీక్ వివరించారు.

గతంలో కూడా నాగార్జున మణిరత్నం (గీతాంజలి), ప్రియదర్శన్ వంటి ఇతర భాషల దర్శకులతో పనిచేసి బ్లాక్‌బస్టర్లు అందుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇక, ఈ సినిమాలో నాగార్జునకు జోడీగా ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్లు తెలుస్తోంది. వారిలో సీనియర్ నటి టబు ఓ కీలక పాత్ర పోషిస్తుండగా, 'నాట్యం' ఫేమ్ సుస్మిత భట్ మరో కథానాయికగా ఎంపికైనట్లు సమాచారం. ఈ తాజా అప్‌డేట్స్‌తో 'కింగ్ 100'పై అభిమానుల్లో ఉన్న అంచనాలు రెట్టింపయ్యాయి.

# భార్యపై ప్రశంసలు కురిపించిన అల్లు శిరీష్



టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ తన వివాహం తర్వాత జీవితంలో చోటుచేసుకున్న మార్పులను, వేడుక విశేషాలను పంచుకున్నాడు. తన ప్రియురాలు నయనికను పెళ్లాడిన శిరీష్... వివాహానంతరం ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో తన భార్యపై ప్రశంసల వర్షం కురిపించాడు. నయనిక చాలా తెలివైనదని, తన కుటుంబ సభ్యులతో చాలా త్వరగా కలిసిపోయిందని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఎక్కడికి వెళ్లినా తన ఒక్కడికే ఖర్చు పెట్టుకునేవాడినని, ఇప్పుడు ఇద్దరి బిల్లులు కట్టాల్సి ఉంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు. పెళ్లి వేడుకలో తన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పోషించిన పాత్ర గురించి శిరీష్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ఇంత పెద్ద వేడుకలో చిన్నపాటి పొరపాట్లు జరగడం సహజమని, వాటిని పట్టించుకోకుండా ప్రతి క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలని బన్నీ ఇచ్చిన సలహా తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. అల్లు అర్జున్ స్వయంగా పెళ్లి పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించాడని, వేడుక ముగిసే వరకు అక్కడే ఉండి అన్ని బాధ్యతలు నెరవేర్చాడని శిరీష్ గుర్తు చేసుకున్నాడు.

# నటి హన్సికకు విడాకులు.. ముగిసిన వివాహ బంధం



ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వానీ తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. వ్యాపారవేత్త సోహైల్ ఖతురియాతో ఆమె అధికారికంగా విడాకులు తీసుకున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ విడిపోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. దీంతో వారి రెండేళ్ల వివాహ బంధం ముగిసినట్లయింది.

2022 డిసెంబర్‌లో హన్సిక, సోహైల్ వివాహం రాజస్థాన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. అయితే, పెళ్లయిన కొద్ది కాలానికే ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయని ప్రచారం మొదలైంది. సోషల్ మీడియా ఖాతాల నుంచి హన్సిక తన పెళ్లి ఫొటోలను తొలగించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. 2024 జులై నుంచే వీరిద్దరూ వేర్వేరుగా ఉంటున్నట్లు సమాచారం.

కలిసి జీవించడం సాధ్యం కాదని నిర్ణయించుకున్న తర్వాత హన్సిక-సోహైల్ పరస్పర అంగీకారంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తాజాగా విడాకులను ఖరారు చేసింది. కాగా, హన్సికను వివాహం చేసుకోవడానికి ముందే సోహైల్‌కు రింకీ బజాన్‌తో వివాహమై విడాకులు కావడం గమనార్హం. 'దేశముదురు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన హన్సిక, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'కంత్రి', 'మస్కా', 'కందిరీగ' వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి టాలీవుడ్‌లో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ ఆమె 50కి పైగా సినిమాల్లో నటించారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**